# ఎవరి భార్య దొడ్డది?

"వాని భార్య గుడ్డిది.....................
వీని భార్య చెడ్డది.......................

—మూడో చరణం నోటంట రాకుండానే ఆ పాటగానికి.........
............ఏటిసీట గాలపేట.................మేటి మీను పడ్డది.

మూడో చరణం మరి దానంతటదే వచ్చేసింది.

"ఎవని భార్య దొడ్డది?"........

ఏతదశరానుభూతమైన ఊలేసుకుంటూ చుట్టూ వున్నట్టి దిశలన్నీ చూచేడు. చేతినాళ్ళు అన్నీ బిగబట్టి లాగేడు. థదేల్ థదేల్మని సీటిని తోకతో కొట్టుకొంటూ. ఫలితం, పెద్ద వాలుగులా తుదకు తేలింది. సీటిలోపట్నుంచి చేప ఎత్తబడుతూ వున్నప్పటి దాని మిలమిల, దాని ధగధగ. దాని సెలవులంట చిమ్మే నెత్తురువట్టు సూర్యాస్తమానపు కాంతిలో మరింత శోభాయమానంగావుంది. మృత్యుదేవత యొక్క అందంఅంతా ఆహా ఆ చేపయొక్క గంజలు రెండూ నొక్కి, పైకి ఎక్క లాక్కుంటూ వున్నాదేమో అన్నట్టు గాలకాడు, తన ఎడంచేతి వేళ్ళతో చేపముట్టె బొత్తలదేటట్టు పొడిచి, కుడిచేతిని గొంతులో కంటా పోనిచ్చి. ఉక్కుకొంకి పైకి వూళ్లాగి. చచ్చిపోతూవున్న చేపను పరిశుభ్రంగా కడిగి, పైకి ఎత్తి, శమనగావున్న సాయంకాల రశ్మి కెదురుగా తోరణంపట్టి అన్నాళ్ళకు తన శ్రమ పండిందన్నట్లు ఆనంద పరవశుడయ్యేడు. సంతకు గొంపోతే వరహాకు తక్కువ కాకుండా వెల వచ్చి తీరుతుంది అని నిశ్చయించుకున్నాడు. బడిశంతాడు సీటిలో ఉప్పళించుకుంటూ వున్నాడు. ఉప్పళించుకొన్న తాడును చుట్టేసుకుంటూ వున్నాడు. విందు చేపను మధ్యమధ్య చూసుకుంటూ వున్నాడు.

దగ్గర్లో చాకిరేవుంది. రేవులో చాలామంది చాకళ్లు. అప్పటికప్పుడే బానలు బోర్లించేసుకు, బట్టలు మడతపెట్టుకు, మూటలు కట్టుకు, వాళ్ళవాళ్ళ యిళ్ళకు మళ్లుమొగాలు పెట్టుకు పోతూవున్నారు. ఒకర్తెమాత్రం—దాని పేరు 'గురివి', రేవులో దాని విశ్రుతనామం 'గురవక్క'. అదిమాత్రం ఇంకా ఇసక మీదనే వుండి యెంచక్కాటి, 'చలవచేసినయట్టి విలువైన వలి వంబు' కమ్మి కనబరుస్తూ అప్పటికప్పు డారి, ఎక్కడికక్కడ పతాకంగా వున్నదాన్ని కుచ్చెళ్లు తెమల్చి, సొంత కళ ఉట్టిపడే టట్టు కట్టుకుంటూ వుంది. తియ్యనిగాలి రంయిని మూడులంకలా ఏడుసాయలా పోసుకు దక్షిణపు తెరపినే కొడుతూవుంటే, కొంగు అకట్టుకుంటూ, చెదరగొట్టుకుంటూ, చెదరగొట్టుకుంటూ, ఆ కట్టు కొంటూవుంది.

మనుష్య చేష్టగా చెప్పేనా? లేదు. గాలే ఆకట్టి గాలే చెదరగొడుతూ వుంది. ఏమా అంటే ఆపె తెగబారెడు తల వెంట్రుకలూ ముంగురుల సమేతంగా ఆపె చేరెడు చేరెడు కళ్ళ తోనూ దోబూచు లాడుతున్నాయి. శిరోజాల నల్లాడించే అదమా యించే శక్తికూడా ఆ మగనాలికే వుందంటారా? ఉండనూవచ్చు. ఆమె దేహయష్టి అంతటి పరిపుష్టితో అంతటి ప్రజ్ఞతో కూడి కొన్నదే అవును! సంశయం ఎంతమాత్రమున్నూ లేదు. మరిన్నీ అప్పుడే బల్లకూ బానకూ దైనందిన సంధ్యాస్వస్తి చెప్పి, తాను చల్లనీ్నటిలో వాల్లాడి పైకివచ్చి. ఆ నారి ఆ చీర ఏరికోరి ధరిస్తూ వున్నదేమో అప్పట్లో ఆపె వొంటిచాయ రెట్టింతలై పట్టపగ్గా ల్లేకుండా మెఱపులాంటి తళక్ తళక్ కాంతిల్లుతూ వుంది.

* * * * *

"గాలాపురాయడా! ఏలాగు పడ్డది?
నా అంత చేప? నీ భార్య దొడ్డది!"

అని ఎవడో తత్కాల వినూతన సమస్యను ఉచ్చైస్స్వనం గావించి, రోదసిని పూరిస్తూవున్న ఒకనొకని వాక్కు ఆమె చెవికి అంతలో సోకినట్టయింది – ఆమె చెవికి సోకిందీ అంటే, అక్కడే యింకా కూర్చునివున్న గాలకాని చెవిలో మాత్రం పడకుండా వుంటుందా? గాలకాడేం చెవిటివాడా? లోతునీటిలో తమర్ని పుట్టించిన ధాతకైనా తెలియనీయకుండా మెలగే మత్స్యాల నర్మాలు వింటూ మెళుకవలు అలవరచుకొన్న అతి గడసరి. 'తనకు భార్యలేదనీ, ఆ సంగతి అవతలవానికి తెలియక పోవచ్చుననీ, తనకు భార్య అంటూ వున్నా, ఆమాత్రం దొడ్డది కానేరదనీ ఇలా ఆ వినబడ్డ ముక్కనంతనూ ఆధారం లేనిదానిగా చేసి పారేసుకుంటూ. ఆ వాలుగుచేపను బుజమ్మీదుగా వీపున వ్రేలాడేసుకుని తత్క్షణం లేచి తూర్పుదెసగా నడచి పోతున్నాడు. ఆలా నడచి పోతూవున్న గాలకాని వీపువంకకూ, వాని వీపు మీద మెలికపోతూవున్న చేపవంకకూ చూస్తూ, చాకెతజవ్వని, ఉదికి పెట్టుకున్న మూటలోంచి రయికతరువాత రయిక, రయిక తరువాత రయిక తీసి, ఒకటి గుత్తే ఎక్కక, ఒకటి మోచేయి దాటక, ఒకటి జబ్బలనప్పక, ఒకటి బోరముడికి చిక్కక, యిలా తంటాలు పడుతూవుంది. ఆ తంటాలుపడుతూ వుండడంలోనే వొయ్యారం వొలికిస్తూవుంది. మీను దూరదూరంగా వెళ్లిపోతూ వున్నకొద్దీ ఆమెదృష్టి ఇంకా సోగమోస్తూ, వాడికొస్తూ హెచ్చరిల్ల నేర్చింది. ఆమె తన యొక్క పెనిమిట్ని చూణ్ణేలేదు. స్మృతిలో చూచాయగా గొంతుక పోల్చగలిగిన్నీ – ఆమె తనయొక్క నాధుణ్ణి చూణ్ణేలేదు.

ఆపె పెనిమిటి నాడుపడ్డ శ్రమ వింటారా? పాఠకులు తమకెందుకంటారా? మిట్టమధ్యాహ్నం ఎండలో నిలబడి మేలెదు మాసిన బట్టలు ఉదికీ ఉదికీ ఉస్సని కూర్చునివున్న 'సెకను'లో కబురెట్టా రెవరో—వారి యింటిచాకలి తానే అనుకొంటూ, గొడ్డలేసుకు వెంటనే బయల్దేరాడు చేరువనే ఉన్న రుద్రభూమికి....ప్రేతాని క్కపాలమోక్ష మయ్యేపర్యంతం కదకంటా వేచియుండి, తరువాత నెవరూలేకుండా చూచి, కాలగా మిగిలిన కాటి కాష్ఠపుదుంగల్ని ప్రక్కనేవున్న గోదావరిగంగలో శుద్ధికీ శీతలానికీకూడా మంచిదని ముంచి, నీటిలో తేల లాగికొంటూ ,గొడ్డలి బుజాన్ని పడిపోకుండా సవరించుకొంటూ సంజపొద్దుకు తనయెప్పటి చాకిరేవు ప్రాంతానికి చేరుకోగలిగాడు. వా డదివరకెప్పుడూ చూచిందిలేదు-ఆ గాలానికేకాదు-ఏ గాలానికీ అంతచేపపడ్డం! చూస్తూ పాడేడు తన చేతిబరువుకు చదువుగా కూడా వుండేటట్టు.

గాలాపు రాయడా!
ఏలాగు పడ్డది!
నాఅంత చేప!
నీ భార్య దొడ్డది!

* * * * *

గాలకాడు చేపను బుజాన్ని వేసికొని లేచి పోవడంలో చాకలివాడిచూపు నిరాటంకంగా ఉత్తరదెసకు ప్రసరించిపోయింది. ఇసకమీద తనభార్య అలా నిలబడి గాలకాని వీపువంకకూ, వీపుమీది మీనువంకకూ చూస్తూవున్న జాడ పెద్దనీడగా అగపించింది. తాను చేత లాగుతూవున్న మానుకట్టెకైనా కొంత నలుపూ కొంత తెలుపూ వుంది, కాని, వానికి కనబడ్డ ఆ జాడలో జములులేదు.

నీళ్లల్లో ఆ కటిమొద్దుల్ని అలా వదిలేశాడు. గొడ్డలి బుజం మార్చుకొంటూ తొడలబంటి నుండి మోకాళ్ళబంటికి, మోకాళ్ళబంటినుండి మడమలబంటికి ఆ మదేలు నీళ్ళ నలజడి పెట్టుకుంటూ నడచి వచ్చి తిన్నగా ఒడ్డెక్కి. అటు చూస్తూవున్న తన ఆలిని " ఒలేవ్! ఏంటి చూస్తున్నావ్? ఇంతసేపూ? ఇంకా ఇక్కడ? ఏం పాటపాడుతున్నావ్? మహాదొడ్డచూపు లిసురుతున్నావ్? ఆ దెవడనీ?" అని గద్దించాడు.

నిర్దోషజీవిమీద గద్దింపేం పనిచేస్తుంది? దా కెత మగనికేసి తిరిగి—

"గాలకాడు అనీ" అని జవాబు చెప్పింది.

"ఈ సీర?"

"సీ రెవరిదైనా ఇట్టే అమరి పోతుందిరా?

"రైక?"

"రైకే అమరకుండా వుంది?"

"ఇప్పటికీనా?"

"ఇప్పటికీని?"

"గోరుగాలం గండుమీనుకైనా యీ పొద్దమరింది కాని నీకు రైకమరలేదంటే?"

అంటూ తల్లిని పరశురాముడు తలగొట్టినట్టు, చూడలేక చెట్టును నడిమికి చెలిపినట్టు, మేకపోతు నమ్మవారికి బలేసినట్టు, గొడ్డలితో నడుంకాడ, కుత్తుక్కాడ, నరికి మూడుఖండములుగా భార్య శరీరం నీటిలోకి విసరివైచి గాలకావికి తుదముట్టింపు

రేపు! రేపు! అవి అనుకుంటూ ఎక్కడికో ఆ దుర్మార్గుడు పరారై పోయినాడు.

హతవిధీ! ఆ హంతకునకు మఱి మానసిక పరివర్తనము లేదా రెండవ హత్యకూడా జరగడమేనా?

* * * * *

మర్నాడు గాలకాడు యథాప్రకారంగా సాయకాలంవచ్చి తనగాలం నీటిలోకి విసురుకూర్చున్నాడు. వెనకాలే చాకలి వెళ్లి వాని వీపుచెంత సాక్షాత్కరించి—ఆదాకా లోకాన్నంతనూ సంహరిద్దామని అనుకొన్నవాడు గొడ్డలికూడా పట్టుకురాకుండా—ఇలా ఎచ్చరించసాగాడు—

"లాగు! అదే వాడుపు! లాగు! లాగు! విన్నటిదాని కంటే విదుపైన నీచు నీటైన కూర పడగలదు. లాగు! లాగు! నీదు భార్య దొడ్డది! లాగు లాగు! తోడు! తోడు! తాడు తోడుకో!" అన్నాడు.

గాలాపురాయడు వెను దిరిగి చూస్తూ "నాకు భార్య లేదోయి తమ్ముడూ! నీదుభార్య దొడ్డది. ఏది ఆపె? ఏది ఆపె? ఈ పొద్దు?" అంటూ గాలం త్రాటికి ఉసులిచ్చాడు.

ఆ ఉసులు కులిక్కిపడుతూ చాకలి చూస్తూవున్నాడు ఉత్త చూపులు. ఎదరవానికి చేపాలేదు, జెల్లాలేదు. తనకు యిల్లూలేదు, వాకిలీ లేదు.

ఇద్దరూకూడా ముఖముఖాలు తర్కించుకుంటూ విన్న బోయి మిన్నకున్నారు. మింటిమొగ నింకనూ సూర్యుడున్నాడు.